సాక్షి వరంగల్

బుధవారం | 9 | ఆగస్టు | 2023



అడవే అమ్మఒడి
దేశానికి స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడిచినా అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అనేకమంది నేటికీ అభివృద్ధికి దూరంగానే ఉన్నారు. - 8లో



బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం
బహుజన ప్రభుత్వం విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33°/25°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉండి సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గొర్రెల యూనిట్లతో ఉపాధి పొందాలి



గీసుకొండ: ప్రభుత్వం ఎస్‌ఆర్‌డీపీ పథకంలో మంజూరు చేసిన రెండో విడత గొర్రెల యూనిట్ల లబ్ధిదారులు వాటిని సరిగా పోషించి ఉపాధిని పొందాలని జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో లెంకలపెల్లి మల్లికార్జున్, దొండ రవి, జక్కుల మొగిలి, బొల్లెబోయిన చంద్రమౌళి, రాజబోయిన రవిలకు మంగళవారం గొర్రెల యూనిట్లు, మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఆయన మాట్లాడారు. మండల పశువైద్యాధికారి వడ్డేపల్లి రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి శివ, మార్కెట్ డైరెక్టర్ గోలి రాజయ్య, నాయకులు కొమ్ముల కిషోర్, జక్కుల రాజు, గంగుల నాగరాజు పాల్గొన్నారు.

ఆర్‌డీఎఫ్ విద్యార్థినికి బంగారు పతకం



పర్వతగిరి: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 7వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడల్లో కల్లెడ ఆర్‌డీఎఫ్ కళాశాల విద్యార్థిని అక్షయ అండర్ –18 రన్నింగ్ విభాగంలో 100మీటర్స్‌లో బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. బంగారు పతకం సాధించిన అక్షయను మంగళవారం ప్రిన్సిపాల్ జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాజు, ఏఓ యాకాంబ్రం, మూర్తి, భిక్షపతి, మహేందర్, మహిపాల్, అశోక్, శ్రీలత, లావణ్య, సత్యనారాయణ, మహేష్, పీఈటీలు మౌనిక, కమలేష్, అధ్యాపకులు అభినందించారు.

ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలి



గీసుకొండ: ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖలోని కీటక జనిత వ్యాధుల నివారణ వైద్య బృందం సూచించింది. ఈమేరకు వరంగల్ నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంతోపాటు కీర్తినగర్, చింతల్ పీహెచ్‌సీలను బృందం మంగళవారం సందర్శించింది. యూపీహెచ్‌సీల్లో ఉన్న ల్యాబ్‌లను తనిఖీ చేసి ఆయా ప్రాంతాల్లో నమోదైన మలేరియా, డెంగీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి ప్రభావిత ప్రాంతాలను ముందే గుర్తించి యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టి, పద్ధతి ప్రకారం వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జ్వర సర్వే చేసి బాధితుల నుంచి రక్త నమూనాలను సేకరించి సత్వర వైద్య సేవలు అందించాలని తెలిపారు. కేంద్ర బృందంలో టెక్నికల్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, కన్సల్‌టెంట్ ఎస్.లక్ష్మణ్, టెక్నీషియన్ హరినాథ్ ఉండగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్, డాక్టర్ దిలీప్, డాక్టర్ అర్చన, సబ్ యూనిట్ ఆఫీసర్లు మాడిశెట్టి శ్రీనివాస్, విజయేంద్రకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ పాలకుర్తి సదానందం, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


పండ్లతోటల రైతులను ఎంపిక చేయాలి



సంగెం: ప్రతీ ఫీల్డ్‌అసిస్టెంట్ పరిధిలో 10 ఎకరాల్లో పండ్లతోటలు పెంచే రైతులను ఎంపిక చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి ఆదేశించారు. మండలంలోని ఆశాలపల్లి, గవిచర్ల, కాపులకనిపర్తి గ్రామాల్లోని మంగళవారం నర్సరీలు, హరితహారం పనులను సందర్శించి పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పండ్లతోటల రైతులను గుర్తించని ఫీల్డ్‌అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏపీఓ లక్ష్మి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘మందుల మాయ’గాళ్లు

- రైతులను దోచుకుంటున్న దళారులు
- నకిలీ ఎరువులు అంటగడుతున్న వైనం
- తనిఖీలు మరిచిన వ్యవసాయ అధికారులు



నగరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ, కాలం చెల్లిన పురుగు మందులు

కరీమాబాద్: పుడమి తల్లిని నమ్ముకుని కష్టపడే రైతన్నలకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. తాను నమ్ముకున్న వ్యవసాయంలో రెక్కలు ముక్కలు చేసుకుంటూ పట్టెడన్నం పెడుతున్న పాపానికి రైతన్నలు ఏదో రకంగా దోపిడీకి గురవుతూనే ఉన్నారు. వ్యాపారుల మాటలకు మోసపోతూనే ఉన్నారు. విత్తనాల కొనుగోలు మొదలు.. ఎరువులు, పురుగుమందుల నుంచి మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయించేవరకు దగా పడుతూనే వస్తున్నారు. పంటల సాగు సందర్భాల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దళారుల చేతిలో మోసపోకతప్పడంలేదు.

వ్యాపారుల ఇష్టారాజ్యం

జిల్లాలో 457 పురుగు మందుల షాపులు ఉండగా జిల్లాకేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులు అడిగినవి కాకుండా వారికి లాభం వచ్చేవి అమ్మడమే వ్యాపారులు లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. కంపెనీలు తమ ఉత్పత్తుల విక్రయాల కోసం వ్యాపారులకు ఆఫర్లు ఇస్తుంటాయి. దీంతో వ్యాపారులు వ్యాపారులు స్వలాభం కోసం నాణ్యత లేని మందులు రైతులకు అంటగడుతున్నారనే ప్రచారం ఉంది.

బిల్లులివ్వరు.. లెక్కచూపరు

షాపులో రైతులు ఏ రకం విత్తనాలు కొనుగోలు చేసినా రశీదులు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా విత్తనాలు మొలకెత్తకపోయినా, కాపు రాకపోయినా, మొక్కల ఎదుగుదల లేకపోయినా.. సంబంధిత కంపెనీపై చర్యలతో రైతులకు పరిహారం అందుతుంది. అయితే ఖరీఫ్‌లో వరంగల్ స్టేషన్ రోడ్డులోని పలు దుకాణాల్లో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేస్తే బిల్లులు ఇవ్వడం లేదని పలువురు రైతులు వ్యవసాయ శాఖ జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. దుకాణాల్లో స్టాక్ బుక్‌ల నిర్వహణలోనూ తప్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజువారీగా విక్రయించిన సరుకులను స్టాక్‌బుక్‌లో తీసివేసి షాపులోని నిల్వలను బోర్డుపై రాయాల్సి ఉంటుంది. కానీ, వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

‘తెలిసిన’ వారే కారకులు

విత్తనాల నుంచి మొదలు పురుగు మందుల వరకు కల్తీ చేయడం, నకిలీవి తయారు చేయడంలో ఆ రంగంపై అవగాహన ఉన్నవారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. అనేక సందర్భాల్లో పట్టుబడిన వారిలో ఎక్కువమంది గతంలో ఏదో విత్తనాలు, పురుగు మందుల కంపెనీలో పనిచేసిన వారు.. లేక వ్యాపారం చేసి నష్టపోయిన వారో ఉండడం గమనార్హం. ఏదో కంపెనీ పేరు మీద లేబుల్స్, స్టిక్కర్లు తయారు చేయించడం జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేసిన విత్తనాలను పాకెట్లలో నింపి రైతులకు అంటగట్టేవారు.. ప్రస్తుతం ఎరువుల విషయంలోనూ అలాంటి ఘటనలే చోటుచేసుకోవడం గమనార్హం.

తనిఖీలు మరిచిన అధికారులు

జిల్లాలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు విత్తనాలు, పురుగుమందులను కూడా పరిశీలించాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడంలేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

వ్యవసాయ గణన పకడ్బందీగా చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: జిల్లాలో వ్యవసాయ కమతాల గణన పకడ్బందీగా చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జిల్లా గణాంక, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. 2021–2022కు సంబంధించిన 11వ వ్యవసాయ గణన చేపట్టనున్నట్లు చెప్పారు. రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని మూడు దశల్లో సర్వే చేస్తారని తెలిపారు. మొదటి దశలో సెన్సెస్ ఆఫ్ ల్యాండ్ హోల్డింగ్ సర్వే చేస్తారని తెలిపారు. వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతోపాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకి ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ దశలో కమతాలవారీగా విస్తీర్ణం, యజమాని, సాగుదారుని వివరాలు, సామాజికవర్గాల వారీగా సాగుదారుల లింగ బేధాలు, ఏయే పంటలు పండిస్తున్నారు, నీటి వినియోగం, సాగునీటి వనరుల వివరాలను గణించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలతో సర్వే పూర్తి చేసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఏఈఓలను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సర్వే ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని చెప్పారు. వరంగల్ జిల్లాకు సంబంధించి 191 రెవెన్యూ గ్రామాల్లో 59 మంది గణకులు, 33 మంది సూపర్‌వైజర్లు, 13 మంది ఎంఏఓలు కలిసి ఈ సర్వే చేస్తారని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు వ్యవసాయ గణన ఉద్దేశాలు, సర్వే పదాల నిర్వచనాలను వివరించారు. జేడీఏ ఉషాదయాళ్, సీపీఓ జీవరత్నం పాల్గొన్నారు.

భూ సేకరణపై కలెక్టర్ సమీక్ష

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టనున్న భూ సేకరణపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జాతీయ రహదారి 163, ఎస్సారెస్పీ, మెగా టెక్స్‌టైల్ పార్క్, ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు వాసుచంద్ర, కృష్ణవేణితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతన జీఓను ప్రకటించాలి

వర్ధన్నపేట: సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులకు కనీస వేతన జీఓను ప్రభుత్వం వెంటనే ప్రకటించి అమలు చేయాలని సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం ఈ నెల 9,10 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్లు, కరపత్రాలను బుధవారం వర్ధన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద ఆవిష్కరించారు. మునీశ్వర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగా ఎన్నో సమస్యలను పరిష్కరించుకున్నామన్నారు. జలగం భిక్షపతి, ఆనందం, శ్రీనివాస్, రవి, వేణు, బుజంగం, రవి, మోహన్, వేణు, రాజు, శ్రీను, సామెల్, ప్రకాష్, సుమన్, సంపత్, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యాంత్రీకరణకు రూ.75కోట్ల పైలెట్ ప్రాజెక్టు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గానికి వ్యవసాయ యాంత్రీకరణకు రూ.75కోట్ల పైలెట్ ప్రాజెక్టు మంజూరైనట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50శాతం సబ్సిడీతో రైతులకు ఈ ప్రాజెక్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో రైతుల అవగాహన కోసం నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18వేల పీవీసీ పైపుల యూనిట్, హెచ్‌డీపీఈ పైపులు, రోటోవేటర్లు, మూడు వేల కరెంటు మోటార్లు, 30వేల టార్పలిన్ కవర్లు, మినీ ట్రాక్టర్లు, అగ్రికల్చర్ ట్రాన్స్‌పోర్టు వెహికిల్స్, 4వేల తైవాన్ పైపులు, మల్టీ క్రషర్స్, ప్యాడి ప్లాంటేషన్ మిషన్స్, కాటన్ పికింగ్ మిషన్స్, స్ప్రేయర్స్, హార్వెస్టింగ్ మిషన్లు, టిల్లర్లు, మోడ్రన్ హ్యాండ్ టూల్స్ రైతులకు ఉపయోగపడేలా పరికరాల యూనిట్లు ఈ ప్రాజెక్టులో సబ్సిడీపై అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణ తరపున గతంలో అమెరికా పర్యటన సందర్భంగా అక్కడ కాటన్ క్రాప్ గ్రోత్ అండ్ ప్రాసీజర్‌పై రీసెర్చ్ కోసం వెళ్లడం, అదే స్థాయిలో అధిక దిగుబడినిచ్చే పద్ధతులు ఇక్కడ పాటించాలని ఆలోచన చేసినట్లు తెలిపారు. భూమి రకాన్ని బట్టి సాయిల్ టెస్టింగ్ ద్వారా ఏ పంటకైతే అనువుగా ఉంటుందో అదే సాగు చేసేలా ప్రోత్సహిస్తామన్నారు. పసలేని చౌకబారు విమర్శలకే పరిమితమైన ప్రతిపక్షాలకు ఈ ప్రాంత రైతులపై ఎలాంటి పక్షవాతం లేకపోగా జరిగిన అభివృద్ధిపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. 42వేల ఎకరాలకు రూ.10వేల నష్టపరిహారం ప్రకటించిన గొప్పనేత సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, నాయకులు లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గుంటి కిషన్, మండల శ్రీనివాస్, గోనె యువరాజు, కౌన్సిలర్ దార్ల రమాదేవి పాల్గొన్నారు.

మెరుగైన విద్య కోసమే శిక్షణ

- డీఈఓ వాసంతి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ

దుగ్గొండి: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం కోసం శిక్షణా శిబిరాలు దోహదపడతాయని డీఈఓ వాసంతి అన్నారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా శిబిరాన్ని ఆమె మంగళవారం పరిశీలించి, మాట్లాడారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులు మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించడం కోసం ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఉపాధ్యాయులు బహుళ తరగతి బోధన చేసే మెలుకువలు నేర్చుకోవాలని సూచించారు. గత సంవత్సరం కొంత ఇబ్బందులు పడ్డారని ఈ సంవత్సరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా మాడ్యూల్స్, వర్క్‌షీట్లు సమకూర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆర్పీలు కైలాసం, శ్రీనివాస్, సుల్తానాభేగం, నవీన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

నల్లబెల్లి: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ వాసంతి అన్నారు. నల్లబెల్లి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గుడ్డు ఇవ్వని రోజు తప్పకుండా రాగిజావ అందించాలని సూచించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ రామస్వామి, పీఆర్‌లు భిక్షపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

- జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సారయ్య



వర్ధన్నపేట: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సారయ్య

చెన్నారావుపేట/వర్ధన్నపేట/ రాయపర్తి: ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మాలోతు సారయ్య సూచించారు. ఈ మేరకు జిల్లాలోని చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, రాయపర్తి మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సారయ్య పరిశీలించి, మాట్లాడారు. పాధ్యాయులు శిక్షణ తరగతులను వినియోగించుకుని విద్యార్థులను ఆంగ్ల భాషలో మాట్లాడే విధంగా తయారు చేయాలన్నారు. ఇంగ్లిష్ రాయడం, చదవడం నేర్పించాలని తెలిపారు. వర్క్‌బుక్స్ ద్వారా ప్రాక్టీస్ చేయించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, జిల్లా ఎఫ్‌ఎల్‌ఎన్ అబ్జర్వర్ నాగేశ్వర్‌రావు, మండల నోడల్ ఆఫీసర్ సరళ, కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, ఎస్‌ఓ జ్యోతి, స్టేట్ రిసోర్స్ పర్సన్ రాయపురెడ్డి, యాకయ్య, నాంపెల్లి సుభాష్, వర్ధన్నపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం, నోడల్ అధికారి సురేందర్, ఉపాధ్యాయులు, రాయపర్తిలో ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ ఆఫీసర్ పులి ఆనందం, హెచ్‌ఎం ఆజ్మీరా ఉమాదేవి, స్టేట్ ఆర్పీలు నాగేశ్వర్‌రావు, ఏపీఆర్ చార్యులు, శిక్షణ ఆర్పీలు జోసఫ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధికి ‘ఉన్నతి’

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హైస్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో అమలు
- 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో హెచ్‌ఎంలకు శిక్షణ
- 17, 18, 19 తేదీల్లో సబ్జెక్టు టీచర్ల రిసోర్స్ పర్సన్లకు..



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నతి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల కోసం దీనిని రూపొందించారు. ఈ కార్యక్రమ ఆవశ్యకత, లక్ష్యాలు, విధివిధానాలు, వాచకాలు, బోధనా ప్రణాళికలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కోసం ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల నుంచే శిక్షణ ఇవ్వనున్నారు.

హనుమకొండ జిల్లాలో 136 పాఠశాలలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. హనుమకొండ జిల్లాలో 124 హైస్కూళ్లు, 9 కేజీబీవీలు, మూడు మోడల్ స్కూళ్లలో ప్రవేశపెట్టనున్నారు.

తొలి విడత హెచ్‌ఎంలకు శిక్షణ

మొదట ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక్కో జిల్లాలో ప్రధానోపాధ్యాయుల నుంచి నలుగురు, సబ్జెక్టు టీచర్ల నుంచి 28 మంది చొప్పున రిసోర్స్ పర్సన్లను గుర్తించారు. హెచ్‌ఎంలకు ఈనెల 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని టీఎస్ ఐపార్డులో శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, సబ్జెక్టు టీచర్ల రిసోర్స్‌పర్సన్లకు ఈనెల 17, 18, 19న హైదరాబాద్‌లోనే శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన వారు తమ తమ జిల్లాలకు వచ్చి మిగతా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఉన్నతి కార్యక్రమ లక్ష్యం..

భాషలో మౌలిక సామర్థ్యాలను చదవడం, రాయడంతోపాటు సామర్థ్యాల వారీగా అభ్యసన ఫలితాలను సాధించడమే ఉన్నతి ఉద్దేశం. నాన్ లాంగ్వేజెస్‌లో పాఠానికి అవసరమైన పూర్వ భావనలు, పలు అంశాలపై అవగాహన కలిగించే ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అభ్యసన ఫలితాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

అభ్యసన సామర్థ్యాల కోసం..

కరోనా అనంతర పరిస్థితుల్లో విద్యార్థులు సామర్థ్యాలను సాధించడంలో వెనుకబడి ఉన్నట్లు వివిధ సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగిస్తే విద్యార్థులు పైతరగతులకు వెళ్తారు. కానీ, అభ్యసన సామర్థ్యాలు, అకడమిక్ పరంగా స్టాండర్డ్స్ పొందలేదు. వీటిని అధిగమించడానికి ఉన్నతి కార్యక్రమం దోహదపడనుంది.

ప్రారంభంలోనే బేస్‌లైన్ టెస్ట్..

ఉన్నతి కార్యక్రమం 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం నిర్దేశించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రారంభంలోనే బేస్ లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. అందుకోసం ప్రశ్నపత్రం రూపొందించి పిల్లల స్థాయిని గుర్తించి నమోదు చేస్తారు.

బోధనా ప్రణాళికలతో..

స్థాయికి అనుగుణంగా బోధనా ప్రణాళికలను రూపొందించుకొని వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పీరియడ్ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటారు. 45 నిమిషాల బోధనా పీరియడ్‌ను సోపానాల ప్రకారం అర్థవంతంగా పఠనోత్సవాన్ని నిర్వహిస్తారు. పిల్లల స్థాయికి అనుగుణంగా బోధనా ప్రక్రియలు, వ్యూహాలను రచించుకుంటారు. భాషా సబ్జెక్టులతోపాటు నాన్ లాంగ్వేజెస్ బోధనలో కూడా కొంత సమయాన్ని ప్రతి పీరియడ్‌లో పిల్లలతో చదివించడానికి కేటాయిస్తారు. సబ్జెక్టుల వారీగా నిర్దేశించిన సామర్థ్యాలను పరీక్షించి పిల్లల ప్రగతిని ఒక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ప్రధానోపాధ్యాయులు నెలవారీగా నిర్వహించే పాఠశాల స్థాయి సమీక్ష సమావేశానికి హాజరై పిల్లల ప్రగతిని చర్చిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, సమీక్ష సమావేశాల్లో ఉపాధ్యాయుల పనితీరును అంచనా వేసి వారికి మార్గదర్శనం చేస్తారు.

ఉన్నతి విజయవంతానికి కృషి



పాఠశాల విద్యాశాఖ సూచనల మేరకు కలెక్టర్ మార్గనిర్దేశంలో జిల్లాలో ఉన్నతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి హనుమకొండ పాఠశాల విద్యాశాఖ కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ద్వారా పూర్తి అవగాహన కల్పించి, కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తాం

- మహ్మద్ అబ్దుల్‌హై, హనుమకొండ డీఈఓ

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం..



విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేస్తాం. తొలి మెట్టు కార్యక్రమం లాగే ఉన్నత పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేస్తాం. విద్యార్థుల పరిస్థితిని అంచనా వేస్తూ, నిరంతర పర్యవేక్షించి ఉత్తమ ఫలితాలు సాధించేలా పనిచేస్తాం. పిల్లలకు తెలుగు, హిందీ, ఆంగ్లంలో చదవడం, రాయడంపై అవగాహన కల్పిస్తాం.

- శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

26, 27తేదీల్లో రాష్ట్రస్థాయి టోర్నమెంట్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని శివాని పబ్లిక్ స్కూల్ లో ఈనెల 26, 27 తేదీల్లో వరంగల్ జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల టార్గెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యూకేషన్ ప్రొఫెసర్, వరంగల్ జిల్లా టార్గెట్ బాల్ టోర్నమెంట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు రాయిడి దృశ్యంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గుండేటి రవీందర్‌గౌడ్, ప్రిన్సిపాల్ మొల్గూరి సురేందర్, యాట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘వీరులకు వందనం’ను జయప్రదం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

గీసుకొండ : బీజేపీ పిలుపు మేరకు ‘నేను పుట్టిన నేల.. నన్ను కన్న దేశం.. మన మట్టికి నమస్సులు.. మన వీరులకు వందనం’ పేరుతో ఈ నెల 9 నుంచి 30 వరకు కార్యకర్తలు, నాయకులు కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కార్యక్రమ కో ఆర్డినేటర్ మల్లాడి తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మండలాలు, నగరంలోని డివిజన్లలో వారి ప్రాంతం అమరవీరులు, స్వాతంత్య్ర సమరయోధులు, సైనిక సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర పోలీసు సిబ్బంది పేర్లతో శిలాఫలకాలను ప్రధాని మోదీ సందేశంతో స్కూళ్లు, పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోని మట్టితో దీపాన్ని తయారు చేసి పంచప్రాణాల ప్రతిజ్ఞ చేయాలని, వసుధ వందనం కింద గ్రామంలో 75 మొక్కలను నాటి అమృత వాటికలను నిర్మించాలని, సైనిక వీరులు, పోలీసులు దేశానికి చేసిన సేవలను గుర్తిస్తూ వారిని సత్కరించాలని, ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పాట్టి శ్రీనివాస్‌గుప్తా, కందిమల్ల మహేశ్, కంది క్రాంతికుమార్, రాయపురపు కుమారస్వామి, రాజేశ్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న ఆర్.మూర్తి

నర్సంపేట: తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యానికి గురి చేస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆర్.మూర్తి ఆరోపించారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వరంగల్ జిల్లా సైకిల్ యాత్రను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ విద్యాసంస్థలు, జూనియర్ కాలేజీల్లో సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో వైఫల్యం చెందిందన్నారు. తక్షణమే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం జరుగుతున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా వ్యాప్తంగా లనిర్వహించనున్న సంఘర్షణ సైకిల్ యాత్ర జయప్రదం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సంఘర్షణ సైకిల్ యాత్ర ద్వారా సమస్యలను గుర్తించి నివేదిక రూపంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాత్రి అనిల్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రశాంత్, రాకేష్, అక్షిత, జిల్లా కమిటీ సభ్యులు శృతి, జ్యోతి, వినోద్, నాయకులు గణేష్, సాయి, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 9వతేదీ నుంచి ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 9, 11, 14, 16, 18 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ఆస్తిలో వాటా కోసం .. నిరసన

- మాజీ ఎంపీ కల్పనాదేవి వారసుడి ఆందోళన



తల్లిదండ్రుల ఫొటోలతో నిరసన చేస్తున్న మాజీ ఎంపీ కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి

హన్మకొండ చౌరస్తా: తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా తన సోదరుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మాజీ ఎంపీ, దివంగత కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్తిలో తన వాటా ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ హనుమకొండ పద్మాక్షికాలనీలోని జయ నర్సింగ్ కళాశాల ఎదుట మంగళవారం అమ్మ, నాన్న ఫొటోలను వెంటబెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉరితాళ్లతో నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న పలువురు స్థానికులు జయసింహారెడ్డి ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆస్తిలో భాగమైన 60 ఎకరాలను తనకు తెలియకుండా సోదరుడు నర్సింగరెడ్డి రియల్ ఎస్టేట్‌కు అప్పగించాడని, వారసత్వ ఆస్తుల లెక్కలు తేల్చకుండా పత్రాలను దాచిపెట్టి తనకు వాటా దక్కకుండా ఒక్కడే అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా నర్సింగరెడ్డి తన ఆస్తుల, ఆదాయ లెక్కలను తేల్చి తనకు రావాల్సిన వాటా ఇవ్వకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు.

అడవే అమ్మఒడి..

విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం ఏజెన్సీ గూడేలు
- ప్రకృతితోనే జీవన గమనం
- పూర్వీకుల నుంచి ఆచరణ
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం : చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో కొండలు..గుట్టలు, ఆ మధ్యలో ఆవసాలు.. వాటి చుట్టు ఉండే వాగులు.. వంకలు..సెలయేరులు.. అటవీ జంతువులతో సహవాసం.. ప్రకృతితో మమేకం. ఇవి ఆదివాసీల జీవన విధానానికి ప్రతీక. బహ్యా ప్రపంచానికి ఏ మాత్రం సంబంధం లేని జీవన విధానం వారి సొంతం. మైదాన ప్రాంత భాష, అలవాట్లు, ఆచారం, ఆహార్యానికి పూర్తి విరుద్ధం. ప్రపంచం కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా ఇప్పటికీ తమ ఆచారం, సంప్రదాయం, సంస్కృతులను అలాగే కొనసాగిస్తున్నారు. అడవిలో లభించే దుంపలు..ఇతర కాయలు ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. నీరు, అటవీ ప్రాంతాలనే ఆసరా చేసుకుని నాడు పూర్వీకులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నాటి ఆవాసాలే నేటి ఆదివాసీ గూడేలు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సమావేశం

ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. 1982 ఆగస్టు 9న జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల సంఘం నిపుణులతో సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను పరిరక్షించడంతోపాటు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 70 దేశాల్లో 5వేల తెగలకు చెందిన 40 కోట్ల జనాభా ఉందని సమాచారం. ఆదివాసీలు 6700 భాషలు మాట్లాడుతున్నారు. దేశంలో 461 రకాల ఆదివాసీ తెగలు ఉండగా 92 శాతం వరకు అటవీ ప్రాంతంలో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అడవులు, కొండలతో నిండి ఉంటుంది. గూడేలు, పెంటల్లో ఆదివాసీ మానవ సమాజం తొలిబిడ్డలు గోండు, కోయ, కోలాం, ప్రర్ధాన్, నాయక్‌పోడ్, బగత, జాతపు, కొండారెడ్డి, చెంచు, ఖోందు, అంధ్, ముఖదొర, ఆరోగ్యం మున్నెంవార్ వంటి జాతులున్నాయి.



కొమ్ము నృత్యం చేస్తున్న దింసా కళాకారులు (ఫైల్)

నృత్యాలు

ఆదివాసీలోని పలు రకాల తెగల్లో ఒక్కొక్కరు ఒక్క రకమైన నృత్యం చేస్తారు. ఇందులో కొమ్ము నృత్యం, దింసా, డోలు నృత్యాలు ఉంటాయి. ఈ నృత్యాలు పెళ్లిళ్లు, జాతర, పండుగల సమయంలో ఎక్కువగా చేస్తారు.



కంతనపల్లి అడవిలో నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)

విద్య, వైద్యం కోసం నేటికీ పోరాటాలే..

అంతర్జాతీయంగా ఆదివాసీల సమస్యలు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, పర్యావరణం వంటి అంశాల పరిరక్షణకు సమితి సర్వప్రతినిధి సభ 1993లోనే తీర్మానం చేసింది. కాగా, జిగురు, బంక, ఇప్పపువ్వు, తునికాకు, చింతపండు, తేనె, చీపుర్లు, విస్తారాకులు, కలప, తదితర అటవీ ఉత్పత్తులపై ఇప్పటికీ ఆదివాసీలు ఆధారపడి జీవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. విద్య, వైద్యం కోసం ఇప్పటికీ ఏదో చోటా పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆదివాసీల చట్టాలు

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఉన్నా వనరులు దోపిడీ అవుతున్నాయని ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం వచ్చిన క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6546 మందికి మందికి పోడు పట్టాలు ఇచ్చారు.



చింతలమోరి గొత్తికోయగూడెం

గూడేల్లో సౌకర్యాలు కరువు

స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మౌలిక వసతులు లేక ఆదివాసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలకు ప్రభుత్వాలు ఇప్పటి వరకూ కనీస వసతులు కల్పించలేకపోయాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంటున్నారనే ఒకే కారణం వారికి శాపంగా మారింది. రోడ్లు ఉండవు.. తాగు నీరు లేదు. విద్యుత్ సరఫరా, పక్కా ఇళ్లు, పాఠశాలు, పౌష్టికాహారం కూడా లేని దీనస్థితిలో గొత్తికోయలు కాలం వెళ్లదీస్తున్నారు.

ఆచారాలు, సంప్రదాయాలు

కోయ మహిళలు నేల మీదే ప్రసవిస్తారు. మంత్రసానులు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టెలో వేసి బారసాల చేయడం వారి ఆచారం. పిల్లల పేర్లు ఇలవెల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువగా ఉంటాయి.

పండుగలు.. దేవతలు

కోయల పండుగలు విభిన్నం.. విశిష్టం. వీరు ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండగ, సూరాల పండుగ, సుంకుల పండుగ చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకుంటారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి



ఆదివాసీల హక్కులను కాపాడాలి. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు పాలకులు మారినా ఆదివాసీల రాతలు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ పథకాలు కింది స్థాయికి చేరితేనే అభివృద్ధి సాధ్యం. దీనిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడాలి.

– కొప్పుల సరిత, ఆదివాసీ మహిళ, ఏటూరునాగారం

సంస్కృతిని పరిరక్షించాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా చూడాలి. పండుగలు, ఆచారాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. వాటికి ప్రత్యేక ప్యాకేజీ కల్పించి ఘనంగా జరపాలి.

– కబ్బాక శ్రావణ్, ఏటూరునాగారం

బావమరిది మృతదేహం తీసుకొస్తుండగా ప్రమాదం.. బావ మృతి

మరిపెడ/బయ్యారం: అనారోగ్యంతో చనిపోయిన బావమరిది మృతదేహన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ మృతిచెందాడు. ఈ దుర్ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన ముద్ద సారయ్య(40) బావమరిది అదే గ్రామానికి చెందిన గజ్జి సంపత్(43) హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతన్ని మృతదేహన్ని బావ సారయ్య ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మరిపెడ మీదుగా స్వగ్రామానికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై కాలువవెంట నిర్మించిన రోడ్డు వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ముందు కూర్చున్న సారయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అందులో ప్రయాణిస్తున్న గజ్జి అప్పయ్య, డ్రైవర్ శివకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.



సారయ్య(ఫైల్)



సంపత్ (ఫైల్)

రైలుకు వెళ్లినా బతికేవాడు..

సారయ్య భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బావమరిది సంపత్ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి సారపాక వెళ్లేందుకు రైలు టికెట్ సైతం రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ బావమరిది చనిపోవడంతో అంబులెన్స్‌లో రావాల్సి వచ్చింది. రైలుకు వెళ్లినా ప్రాణంతో ఉండేవాడని బంధువులు విలపించారు.



పక్కపక్కనే పేర్చిన బావ, బావమరుదుల చితిల వద్ద విషాదంలో బంధువులు

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం



సభలో ఐక్యతా అభివాదం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ నాయకులు

- కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కు తిరిగేందుకు రూ.79 కోట్ల ఖర్చు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పబ్లిక్‌గార్డెన్‌లో 'బహుజన విద్యార్థి భరోసా' సభ



ర్యాలీగా వస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విద్యార్థులను పట్టించుకోని కేసీఆర్ దుకాణం బంద్ చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతి భవన్ మధ్య తిరగడానికి ఏడాదికి రూ.79 కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మంగళవారం 'బహుజన విద్యార్థి భరోసా' సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. అంతకుముందు అదాలత్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు, అనంతరం విద్యార్థులతో కలిసి బైక్ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పేపర్ లీకేజీ సమయంలో అందరికీ అందుబాటులో ఉచితంగా కోచింగ్ మెటీరియల్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, కానీ బహుజనుల రాజ్యంలో ఏసీ కోచింగ్ సెంటర్లు, ఉచితంగా వైఫై, కంప్యూటర్ సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. బహుజన రాజ్యంలో పేపర్ లీకేజీలు ఉండవని, అలాంటి నేరాలకు పాల్పడితే యావజ్జీవ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో 90శాతం మందు దొరుకుతుంది కానీ వైద్యం అందడం లేదని మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన 200 ఎకరాలు భూమిని దొంగలు కబ్జా చేశారని ఆరోపించారు. దళిత, బీసీ, మైనారిటీ బంధు పేర్లతో కేసీఆర్ వస్తున్నాడు కానీ ఆయన దుకాణం బంద్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఆర్ఎస్‌పీ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ విద్యార్థి మేనిఫెస్టోను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్, బొట్ల కార్తీక్, మాదారపు రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణక్వీన్, వరంగల్ రీజియల్ సెక్రటరీ కన్నం సునీల్, జిల్లా నాయకులు సారయ్య, మంద శ్యాం, శనిగరపు రాజు, రజిత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి కడుగుతుండగా..

- పాము కాటు.. చికిత్స పొందుతూ వివాహిత మృతి
- పలివేల్పులలో ఘటన



పద్మ (ఫైల్)

హసన్‌పర్తి : ఇంటి సామగ్రి కడుగుతుండగా పాము కాటు వేసింది. దీంతో ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం నగరంలోని పలువేల్పులలో జరిగింది. పలివేల్పులకు చెందిన సల్లా పద్మ(38) ఉదయం ఇంటి ఆవరణలో సామగ్రి (బోళ్లు) కడుగుతుండగా పాము కాటు వేసింది. వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అప్పల బాధ భరించలేక రైతు ఆత్మహత్య..

అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బైరి సాంబరెడ్డి(58), అవసరాల నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పు చేశారు. తీర్చే మార్గం కనిపించక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, మృతుల కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లావెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్‌చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు యువతి యత్నం



చికిత్స పొందుతున్న ప్రభావతి

గూడూరు: ప్రియుడి పెళ్లికి నిరాకరించాడనే కారణంతో ఓ యువతి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ ప్రభావతి, శివాలయం వీధికి చెందిన కస్నబోయిన కార్తీక్ ప్రేమించుకుంటున్నారు. కాగా, కార్తీక్ పెళ్లి నిరాకరిస్తున్నాడని ప్రభావతి ఆదివారం అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. అదే రోజు రాత్రి కార్తీక్ నర్సంపేట బస్టాండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా బీసీ వర్గానికి చెందిన కార్తీక్.. కొందరి మాటలు విని తన ప్రేమను అంగీకరించడం లేదని ప్రభావతి మనోవేదన గుర్తైంది. ఈ క్రమంలో తాను పురుగుల మందు తాగుతున్నానని, తన మృతికి కార్తీక్‌తో పాటు ప్రేమను కాదంటున్న ఆయన కుటుంబ సభ్యులే కారణమని ఓ లెటర్ రాసింది. అనంతరం పురుగుల మందు తాగింది. ఈ విషయం తల్లికి తెలుపగా కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రభావతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన (పోక్సో) కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పరకాల పట్టణానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని.. లేదంటే మీ అమ్మానాన్నను చంపుతానని వరంగల్ రంగంపేటకు చెందిన వివాహితుడు మహ్మద్ సమీర్ అలియాస్ సాజిత్ 2019 ఏప్రిల్ 24న రాత్రి బెదిరించి వెంట తీసుకెళ్లాడు. 15 రోజులు వివిధ ప్రాంతాల్లో తిప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో సాజిత్‌కు జైలుశిక్షతోపాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ జడ్జి టి.జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసులు అధికారులు మధు, రవికిరణ్, వెంకటరత్నం పరిశోధించగా.. వైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెచ్‌సీ సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థుల ఆందోళన



గేట్ వద్దనే భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల (ఎస్ఎఫ్‌సీ) విద్యార్థులు తమకు హాస్టళ్ల వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం నుంచి మొదటి గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి 11గంటల వరకు కూడా కొనసాగింది. అక్కడే బయటి హాస్టల్‌నుంచి తెచ్చిన సహపంక్తి భోజనాలు చేశారు. మహిళా హాస్టల్‌లో సెల్ఫ్‌ఫైనాన్స్‌కోర్సుల విద్యార్థులు కొందరు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఈ నెల 7న అధికారులు వారిని ఖాళీ చేయించారు. మంగళవారం కూడా పలువురు విద్యార్థినులను ఖాళీ చేయించి బ్యాగులు బయటపెట్టారని ఆరోపిస్తున్నారు. తాము ఎక్కడ ఉండి చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉందని, టైంటేబుల్‌ను కూడా వెల్లడించారని తెలిపారు. యూనివర్సిటీలో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో హాస్టల్ వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు వివిధ విద్యార్థి సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థులు వినలేదు. వీసీ వచ్చి తమకు హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యను వివరణ కోరగా మరో 15 రోజుల్లో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. 15నుంచి 20మంది వరకు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఖాళీ చేయించామని తెలిపారు.

పోలీసులతో వాగ్వాదం..

గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అక్కడినుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొంత తోపులాడుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పోలీసులు వెళ్లిపోవడంతో విద్యార్థులు ఆందోళన కొనసాగించారు.